

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | సోమవారం 25-05-2026 | సంపుటి - 27 | సంచిక -363 | రూ : 4 | పేజీలు: 8


ఇరాన్ అణ్వాయుధాలను

## కోరుకోవడం లేదు



- అణ్వాయుధాల కోసం తాము ప్రయత్నించడం లేదన్న ఇరాన్
- పశ్చిమాసియాలో అశాంతికి ఇజ్రాయెలే కారణమని ఆరోపణ
- ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి ఉందన్న అమెరికా
- హర్మూజ్ జలసంధిపై శుభవార్త రావచ్చని సంకేతాలు

2లో

తెలంగాణకు...

# రూ.9,968 కోట్లు

- కేటాయించిన 16వ ఆర్థిక సంఘం
- 2026-27 నుంచి 2030-31 వరకు విని యోగించాలని నిర్దేశం
- కేంద్రం మార్గదర్శకాలు జారీ



హైదరాబాద్: కేంద్ర 16వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.9,968 కోట్లను కేటాయించింది. 202627 నుంచి 203031 వరకు ఈ నిధులను నిర్దేశించింది. వాటి వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మొత్తాన్ని గ్రామీణ స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్ లైట్‌లు, ఇతర ప్రజా సేవల కోసం వినియోగించాలని పేర్కొంది. ఆయా గ్రాంట్లను వేతనాలు, పెన్షన్ చెల్లింపుల కోసం వినియోగించరాదని నిర్దేశించింది. "ఎప్పటికప్పుడు వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. త్రైమాసిక, వార్షిక పురోగతి

తరువాయి 2లో

తిరుమలలో భక్తజన సంద్రం..

## శ్రీవారి దర్శనాల్లో సరికొత్త రికార్డు

- వేసవి సెలవుల కారణంగా తిరుమలకు పోటెత్తిన భక్తులు
- నిన్న ఒక్కరోజే రికార్డు స్థాయిలో 94,758 మందికి స్వామివారి దర్శనం
- అభిషేక సేవ సమయంలోనూ భక్తులను దర్శనానికి అనుమతించిన టీటీడీ
- సర్వదర్శనం కోసం భక్తులు 24 గంటలకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు


2లో



హిందూ మహాసముద్రంలో

## భారీ 'గ్రావిటీ హోల్'.. వీడిన మిస్టరీ!

2లో



- ఆ హిందూ మహాసముద్రంలో భారీ అగాథం రహస్యాన్ని ఛేదించిన శాస్త్రవేత్తలు
- భారతదేశానికి నైరుతి దిశలో 100 మీటర్ల మేర సముద్ర మట్టం తక్కువ
- భూమి మాంటిల్ పొరల నుంచి పైకి వస్తున్న వేడి పదార్థాలే కారణమని వెల్లడి
- పురాతన టెథిస్ సముద్రం ఫలకాల కదలికలే ఈ ప్రక్రియకు మూలమని గుర్తింపు
- దీనివల్ల ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేసిన నిపుణులు

# సుర్రుమంటున్న సూరీడు

- తూ అర్ధ సెంచరీ చేరువకు పగటిపూట ఉష్ణోగ్రతలు
- ఎండ వేడి, వడగాలుల దాడితో నిప్పుల కొలిమిలా రాష్ట్రం
- వడదెబ్బతో పెరుగుతున్న మృతుల సంఖ్య.. ఆగని మూగజీవాల మృత్యువాత
- కార్మికులు, కూలీల అవస్థలు.. పనుల్లేక ఇబ్బందులు
- పొట్ట కూటికోసం మండుటెండలో శ్రామిక వర్గం
- గిరాకీలేక దుకాణాలు వెలవెల .. ఎండతో జ్యూస్ సెంటర్లకు రాని వైనం
- అగ్నిప్రమాదాలతో రూ. కోట్లల్లో నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు, రైతుల వేడుకోలు

2లో





తెలంగాణలో స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు

## కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం
- వ్యవసాయ కనెక్షన్లు మినహా అందరికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం
- మీటర్ల ఖర్చును 60:40 నిష్పత్తిలో భరించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్న ప్రభుత్వం
- గత ప్రభుత్వ ఒప్పందాన్నే తాము ముందుకు తీసుకెళ్తున్నామన్న మంత్రి పొంగులేటి

2లో

బలూచిస్థాన్‌లో ఉగ్రదాడి

## రైలుపై దాడిలో 24 మంది మృతి!

- క్వెట్టాలో జరిగిన ఉగ్రదాడిలో 24 మంది మృతి
- మృతుల్లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు
- కారు బాంబుతో దాడి చేసినట్లు వెల్లడి

2లో



స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

## 'విజయ్ గెలుపు ఒక సునామీ'

2లో



- తమిళనాడులో అధికార, విపక్ష పార్టీల మధ్య మొదలైన మాటల యుద్ధం
- విజయ్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగలేదన్న స్టాలిన్

# తిరుమలలో భక్తజన సంద్రం.. శ్రీవారి దర్శనాల్లో సరికొత్త రికార్డు

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో పోటెత్తుతోంది. వేసవి సెలవులు కావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 94,758 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈ మే నెలలో ఒకే రోజు దర్శనానికి వచ్చిన వారి సంఖ్య 90 వేలు దాటడం ఇది నాలుగోసారి కావడం విశేషం. సాధారణంగా శుక్రవారం రోజున స్వామివారికి అభిషేకం, ఇతర ప్రత్యేక పూజా కైంకర్యాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో భక్తుల దర్శనానికి కేటాయించే సమయం తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఉదయం జరిగే అభిషేక సేవ సమయంలో కూడా క్యూ లైన్లను నిలిపివేయకుండా సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించింది. ఈ నిర్ణయం వల్ల అదనంగా దాదాపు 5,850 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగలిగారని, మొత్తం 17 గంటలకు పైగా దర్శన సమయం కేటాయించామని టీటీడీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 గంటల సమయం పడుతోంది. కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయి, క్యూ లైన్లు వెలుపలికి విస్తరించాయి. దీంతో, భక్తులు క్యూ లైన్లలోకి రావద్దని, రద్దీని నియంత్రించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. తీవ్రమైన ఎండలు ఉన్నప్పటికీ, వాటిని సైతం లెక్కచేయకుండా భక్తులు తిరుమలకు పోటెత్తడం గమనార్హం. భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు టీటీడీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ టెక్నాలజీని వినియోగిస్తోంది. నడక మార్గాలు, ఘాట్ రోడ్ల ద్వారా బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వస్తున్న భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, కంపార్ట్‌మెంట్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నారు.

## స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు: 'విజయ్ గెలుపు ఒక సునామీ'

తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ' మాత్రమేనని స్టాలిన్ అభివర్ణించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, కేవలం ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని... కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు. టీవీకే పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్ అయిన 118 సీట్ల మార్కును దాటడంలో పూర్తిగా విఫలమైందని గుర్తుచేశారు. కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయిన ఆ ప్రభుత్వం, ఈ రోజు డీఎంకే కూటమిలోని పార్టీల మద్దతు వల్లే మనుగడ సాగిస్తోందని, ఏ క్షణమైనా ఈ ప్రభుత్వం కూలిపోవచ్చని హెచ్చరించారు.

## సుర్రుమంటున్న సూరీడు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న తీవ్ర ఉష్ణోగ్రతలు సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతుండగా, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కూలీల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపుతూ 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో బెంబేలెత్తిస్తున్నాడు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నమయేసరికి నిప్పుల కొలిమి తలపిస్తున్నది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సగం జిల్లాల్లో 46 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో 50 డిగ్రీస్ ఉష్ణోగ్రత (హాఫ్ సెంచరీ) నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండదెబ్బతో వడదెబ్బకు గురై అనేకమంది చనిపోవడం.. అగ్నిప్రమాదాలు చోటు చేసుకుని పంటలు కాలిపోతున్నాయి. మరోవైపు అకాల వర్షాలు, ఈదురు గాలులు పంటలు తడిసిపోవడం,.. ఇలా రాష్ట్రంలో అటు ఎండలు, అకాల వర్షాలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులకూ వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. కార్మికులు పనులకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పుడే ఎండలకు జనాలు అల్లాడుతుంటే రోళ్లు పగిలే రోహిణికార్తె వస్తుండటంతో ఇంకా ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే మధ్యాహ్నం సమయాల్లో జ్యూస్ సెంటర్లకు చల్లటి పానీయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. మద్యం షాపులు మందుబాబులతో కిక్కిరిసిపోతున్నాయి.

నిప్పులకొలిమిలా ఆంధ్రప్రదేశ్...

## తూర్పుగోదావరిలో 48.3 డిగ్రీలతో సీజన్ రికార్డు

ఆంధ్రప్రదేశ్‌లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాడు. ఆదివారం (మే 24) తూర్పుగోదావరి జిల్లా చిట్యాల వద్ద ఈ సీజన్‌లోనే అత్యధికంగా 48.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రాబోయే మూడు రోజుల పాటు ఇదే తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. ఆదివారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటాయి. తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురంలో 48.3, ఉండ్రాజవరంలో 48.1 డిగ్రీలు నమోదవగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి, ఇరగవరం, తణుకులో 48.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోనూ 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా కుక్కునూరులో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల తీవ్రత కనిపించింది. వీటితో పాటు కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని అనేక మండలాల్లో 44 నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో 46.2, కాకినాడ జిల్లా కాజులూరులో 46.5, ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో 45.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సోమవారం (మే 25) కూడా ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలోని 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా కోనసీమ, గోదావరి జిల్లాలు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల వరకు చేరవచ్చని హెచ్చరించింది. విజయనగరం, మన్యం, కాకినాడ, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఒకవైపు ఎండలు మండిపోతున్నా, మరోవైపు ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని హెచ్చరికలు జారీ చేశారు.

## హిందూ మహాసముద్రంలో భారీ 'గ్రావిటీ హోల్'.. వీడిన మిస్టరీ!

హిందూ మహాసముద్రంలో, ముఖ్యంగా భారతదేశానికి నైరుతి దిశలో, ఓ భారీ 'గ్రావిటీ హోల్' ఉన్న విషయం చాలాకాలంగా శాస్త్రవేత్తలకు తెలుసు. ఇది నిజమైన గొయ్యి కాదు, గురుత్వాకర్షణ శక్తి చాలా బలహీనంగా ఉన్న ప్రాంతం. ఈ భౌగోళిక అద్భుతం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు జరిపిన పరిశోధనల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. భూమి అంతర్భాగంలోని సంక్లిష్ట ప్రక్రియలే దీనికి కారణమని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దాదాపు 30 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో, భూ గురుత్వాకర్షణ శక్తి సాధారణం కంటే చాలా తక్కువగా ఉంటుంది. దీని ఫలితంగా, ప్రపంచ సగటుతో పోలిస్తే ఇక్కడ సముద్ర మట్టం సుమారు 106 మీటర్ల వరకు లోతుగా ఉంటుంది. భూమి అంతర్భాగంలోని మాంటిల్ పొరల నుంచి పైకి వస్తున్న అత్యంత వేడి, తక్కువ సాంద్రత కలిగిన శిలాద్రవమే (ప్లూమ్స్) ఈ గురుత్వాకర్షణ వ్యత్యాసానికి కారణమని తాజా కంప్యూటర్ నమూనాలు తేల్చాయి. కోట్ల సంవత్సరాల క్రితం, భారత ఫలకం ఉత్తరం వైపు కదులుతున్నప్పుడు పురాతన 'టెథిస్' మహాసముద్రం మూసుకుపోయింది. ఈ క్రమంలో సముద్రపు ఫలకాలు భూమి లోపలికి చొచ్చుకుపోయి మాంటిల్ పొరలను తాకాయి. ఈ ఒత్తిడికి ఆఫ్రికా కింద ఉన్న భారీ ఉష్ణ ప్రాంతం (ఆఫ్రికన్ సూపర్ ప్లూమ్) నుంచి వేడి పదార్థాలు పైకి నెట్టబడి, భారత మహాసముద్రం కిందకు చేరాయి. ఈ తక్కువ సాంద్రత కలిగిన పదార్థాల వల్ల ఆ ప్రాంతంలో ద్రవ్యరాశి తగ్గి, గురుత్వాకర్షణ బలహీనపడింది. ఈ 'గ్రావిటీ హోల్' ఉనికిని తొలిసారిగా 1940లలో నౌకల ద్వారా గుర్తించగా, తర్వాత ఉపగ్రహాల ద్వారా నిర్ధారించారు. దీనివల్ల మానవులకు గానీ, నౌకాయానానికి గానీ ఎలాంటి ప్రమాదం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే, భూమి అంతర్భాగ నిర్మాణం, టెక్టోనిక్ ప్లేట్ల కదలికలను అర్థం చేసుకోవడానికి, అలాగే ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థల కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి ఈ పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

## రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు..
## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మినహా అన్ని విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్‌ఎస్)లో చేరాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం సమావేశమైన కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని గృహ, వాణిజ్య కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

*** గత ప్రభుత్వ ఒప్పందాన్నే అమలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి**

కేబినెట్ సమావేశం అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అయితే, ఈ ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో చేరాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర విద్యుత్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. కానీ, నాటి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లలేదని, అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వాలే భరిస్తాయని, వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం వ్యయంలో 60% కేంద్ర ప్రభుత్వం, 40% రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి మరోసారి తేల్చిచెప్పారు.

## ఇరాన్ అణ్వాయుధాలను కోరుకోవడం లేదు: అధ్యక్షుడు పెజెష్కియాన్

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను తాము కోరుకోవడం లేదని, ఈ విషయంలో ప్రపంచానికి హామీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. "ఈ ప్రాంతంలో అశాంతిని కోరుకుంటున్నది తాము కాదు. జియోనిస్ట్ ప్రభుత్వం (ఇజ్రాయెల్) మాత్రమే యుద్ధాన్ని, అశాంతిని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది" అని పెజెష్కియాన్ ఆరోపించారు. 'గ్రేటర్ ఇజ్రాయెల్' ప్రణాళికను ఇజ్రాయెల్ అనుసరిస్తోందని విమర్శించారు. దేశ గౌరవంతో చర్చల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని ఆయన తేల్చిచెప్పారు. ఇరాన్‌లో ఏ నిర్ణయమైనా సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ఎన్ఎస్ సీ) పరిధిలోనే, సుప్రీం లీడర్ అనుమతితోనే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ, ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. రాబోయే గంటల్లో హర్మూజ్ జలసంధికి సంబంధించి 'శుభవార్త' వెలువడవచ్చని ఆయన సూచించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని రూబియో మరోసారి పునరుద్ఘాటించారు.

## బలూచిస్థాన్లో ఉగ్రదాడి.. రైలుపై దాడిలో 24 మంది మృతి!

పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆదివారం ఈ దాడి జరిగింది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ రైలులో సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బక్రీద్ పండుగ కోసం వీరంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రైలు క్వెట్టాలోని చమన్ పట్టక్ వద్ద సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నింపిన కారుతో ఒక బోగీని ఉగ్రవాదులు ఢీకొట్టారు. దీంతో భారీ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు రైలు బోగీ నుజ్జునుజ్జయి పక్కకు ఒరిగిపోయింది. పలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్తంతో తడిసిన బాధితులను స్ట్రెచర్లపై తరలిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. విస్తీర్ణంలో పాకిస్థాన్‌లోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ, బలూచిస్థాన్ అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రావిన్స్‌లోని సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని, స్థానిక ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం లేదని బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

## తెలంగాణకు రూ.9,968 కోట్లు

హైదరాబాద్: కేంద్ర 16వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.9,968 కోట్లను కేటాయించింది. 202627 నుంచి 203031 వరకు ఈ నిధులను నిర్దేశించింది. వాటి వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మొత్తాన్ని గ్రామీణ స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్ లైట్‌లు, ఇతర ప్రజా సేవల కోసం వినియోగించాలని పేర్కొంది. ఆయా గ్రాంట్లను వేతనాలు, పెన్షన్ చెల్లింపుల కోసం వినియోగించరాదని నిర్దేశించింది. "ఎప్పటికప్పుడు వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలి. వాటి ఆధారంగా సమగ్ర నివేదికలను రాష్ట్రం.. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి. ఆడిట్‌లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దడానికి చర్యలు తీసుకోవాలి. అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం జరిగిందని తేలితే చట్టపరమైన చర్యలు చేపట్టాలి. వీటిపై పరిపాలన ఉత్తర్వులు జారీ చేయాలి" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**పనితీరు ఆధారంగా...**

ఐదేళ్ల కాలానికి ఆర్థిక సంఘం దేశం మొత్తానికి రూ.4,35,236 కోట్లను గ్రాంట్లుగా ఇస్తుంది. పంచాయతీలకు 80 శాతం; మండల, జిల్లా పరిషత్‌లకు 10 శాతం చొప్పున ఏటా రెండు సమాన విడతల్లో ఇవి విడుదలవుతాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో జూన్‌లో మొదటి, అక్టోబరులో రెండో విడతగా నిధులు అందుతాయి. రాష్ట్రాలు.. స్థానిక సంస్థలకు ఏ మేరకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నాయనే అంశం ఆధారంగా రాష్ట్ర పనితీరును; పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల ఆధారంగా పంచాయతీల పనితీరును పరిగణించి 20 శాతం నిధులివ్వడంపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. 2026 నాటి అంచనా ప్రకారం గ్రామీణ జనాభాకు 90 శాతం, రాష్ట్ర వైశాల్యానికి 10 శాతం వెయిటేజీ ప్రాతిపదికన నిధులు కేటాయించింది. ఇలా లెక్కేసినప్పుడు గ్రామీణ జనాభాకు 1.92 శాతం, తెలంగాణ వైశాల్యానికి 0.37 శాతానికి మొత్తం రూ.4,35,236 కోట్లలో రూ.9,968 కోట్లను ఆర్థిక సంఘం రాష్ట్రానికి కేటాయించింది.

**మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు...**

మొదటి విడత నిధుల కోసం.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్, 202526 ఆర్థిక సంవత్సరం ఆయా స్థానిక సంస్థల ఆడిట్ నివేదికలను సమర్పించాలి. మొదటి విడత నిధుల వినియోగ ధ్రువీకరణ, పురోగతి నివేదికల ప్రకారం రెండో విడత నిధులను కేంద్రం విడుదల చేస్తుంది. గ్రాంట్లు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు వెళ్తాయి. వాటిని పది పనిదినాల్లో సంబంధిత గ్రామీణ స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. రాజ్యాంగంలోని 9వ భాగం ప్రకారం సక్రమంగా ఎన్నికైన స్థానిక సంస్థలకే నిధులు విడుదలవుతాయి. నిర్దేశిత అవసరాలకు కేటాయించిన నిధులను వాటికే వెచ్చించాలి. వాటిని టైడ్ నిధులుగా వ్యవహరిస్తారు. అన్‌టైడ్ నిధులలో 20 శాతం కంటే ఎక్కువ నిధులను రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం ఖర్చు చేయరాదు. నిధుల వినియోగంపై గ్రామ సభలో, మండల, జిల్లా ప్రజా పరిషత్ సమావేశాల్లో విధిగా తీర్మానం చేయాలి. వాటిని ఇగ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.

## మూగజీవాలపై మమకారం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మండుతున్న ఎండల్లో మూగజీవాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు కొత్తగూడెం పూర్వ రిటైర్డ్ ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్. వేసవి తీవ్రత కారణంగా దాహార్తితో అలమటిస్తున్న పశువులు, పక్షుల కోసం తన నివాసం పరిసరాల్లో ప్రత్యేకంగా నీటి పాత్రలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ నీటిని అందుబాటులో ఉంచుతున్నారు.మానవత్వంతో పాటు జంతువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని సూచిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు నీటి పాత్రలు ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ ప్రభుదయాల్ చేస్తున్న ఈ సేవను స్థానికులు అభినందిస్తున్నారు.

## వెల్ది జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని వెల్ది గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ) ఆవరణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. దాదాపు 22 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఒకే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే చోటికి చేరడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజులను, నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా విద్యార్థులు ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు.22 ఏళ్ల తర్వాత స్నేహితులందరినీ మళ్లీ కలుసుకోవడం, నాటి గురువుల చేతుల మీదుగా ఆశీర్వాదం పొందడం మర్చిపోలేని అనుభూతి" అని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్వి గంగాధర్, రావుల పద్మజ, పరమేశ్వర్, రాసమల్ల శారద, లింగంపల్లి సురేందర్, ముత్యాలు నరసయ్య, దర్శనాల రవి, చెరుకు సత్యనారాయణ, పన్నీరు సుధాకర్, నూనె ముంతల పరశురాములు,నకిరెడ్డి మాధవి, కొనుకటి స్వప్న, చెరుకు లక్ష్మి, నూనమంతుల సుహాసిని, సింగిరెడ్డి అశోక్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి విందు ఆరగించి, సెల్ఫీలు దిగుతూ రోజంతా ఎంతో ఉత్సాహంగా గడిపారు.

కాంగ్రెస్ పాలనలో నీటి కష్టాలు

## వాటర్ ట్యాంకర్ల చుట్టూ తిరుగుతున్న ప్రజలు..!



మెడిపల్లి, ప్రజాస్ఫూర్తి :మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ బుద్ధానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు , స్థానికులతో కలిసి కాలనీల్లో పర్యటించి నీటి సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సమర్థవంతమైన తాగునీటి సరఫరా జరిగేదని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల చుట్టూ తిరిగే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. పలు చోట్ల రోజుల తరబడి నీటి సరఫరా లేక మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.నీటి సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానికులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి నీటి కష్టాలు చూడలేదు... ఇప్పుడు మాత్రం ప్రతి కాలనీలో ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి వచ్చింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజల తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యకురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, ఆకుల మధుకర్, గడీల జగన్ రెడ్డి, వీరమళ్ళ జగన్నాథం, ఏనుగు రాంరెడ్డి, ఇంద్రారెడ్డి, శంకర్, వారికల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్, అశోక్ రెడ్డి, నర్సి రెడ్డి, వెంకట్, కైసర్, అక్షిత్ యాదవ్, సాయి శెట్టి, కోల శ్రీనివాస్,ప్రవీణ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

* **రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**




ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ,ఆసిఫాబాద్ జిల్లా: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశిత మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 8 వేల 5751కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి, 8 వేల 749 కోట్ల రూపాయల నగదు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపులు వెంటనే చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించడం జరుగుతుందని, ప్రతిరోజు వరి ధాన్యం ప్రక్రియ పురోగతిపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర పోరుతోనే అభ్యుదయం తెచ్చారు..

* **పాత్రికేయులకు మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసలు..**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : అక్షరపోరుతో అభ్యుదయం తెచ్చారు.. ఆది నుంచి అంతం వరకు లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం పోరాడారు.. జలాశయ సాధనే ఆశయంగా ముందుకు సాగి నాయకులను అప్రమత్తం చేసి రిజర్వాయర్ సాధించిన ఘనత పాత్రికేయులకు దక్కుతుందని మంత్రి వాకిట శ్రీహరి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాత్రికేయులను అభినందించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల తరపున సీనియర్ జర్నలిస్ట్ కేపీకి, అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా తరపున ఆంజనేయులు గౌడ్ కు శాలువాతో సన్మానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మీడియా నిష్పక్షపాతంగా పనిచేసినప్పుడే ఇలాంటివి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. లక్ష్మీదేవి పల్లి విషయంలో అలా పోరాడినందుకే సాధనవైపు పాలకులు ముందుకు సాగారని అన్నారు. ఎవరు తప్పు చేసినా, చివరికి మేము తప్పు చేసిన ప్రశ్నించే హక్కు మీడియాకు ఉందని, భవిష్యత్తులను ఇదే పట్టుదలతో, నియోజకవర్గ అభివృద్ధి ఆశయంగా పెట్టుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా రూపంలో జర్నలిస్టులు అందించిన కథనాలు లక్ష్మీదేవి పల్లిని వేగంగా ముందుకు నడిపించేలా చేశాయని వారు పేర్కొన్నారు. ఇలాంటి కృషి చేసిన మీడియా ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పాత్రికేయులు రంగనాథ్, శరత్, రాఘవేందర్ గౌడ్, లక్కాకుల రమేష్, సరాపు రమేష్, రంగనాథ్, శరత్, సురేష్, నరసింహారెడ్డి, ఆంజనేయులు గౌడ్, సాయి రెడ్డి, రాకేష్, శ్రీకాంత్,మల్లికార్జున్, ధరంపాల్, షకీల్, రియాజ్, దర్శనం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి తోటిమిత్రులు ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన హేచ్. వెంకటేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆపదలో వెంకటేష్ కుటుంబానికి అండగా మేమున్నామంటూ తోటి స్నేహితులు ముందుకు వచ్చారు. కేశంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1997/1998 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన విద్యార్థులు అందరూ కలిసి వెంకటేష్ కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ పదో తరగతి చదువుకున్న బ్యాచ్ మొత్తానికి ఎవరైనా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడితే తమ వంతు సాయం ఉంటుందని అన్నారు. హేచ్.వెంకటేష్ కుటుంబ సభ్యులు పదో తరగతి చదువుకున్న స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు పదో తరగతి స్నేహితులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ పట్టణంలో పార్క్ ప్యాలెస్ హోటల్ ప్రారంభం




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : హైదరాబాద్ తదితర పెద్ద ప్రాంతాలలో ఉండాల్సిన సౌకర్యాలతో ఉన్నటువంటి అతి పెద్ద హోటల్ వ్యవస్థను అన్ని సదుపాయాలతో సౌకర్యాలతో షాద్ నగర్ పట్టణంలో కూడా ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇలాంటి హోటల్స్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్క్ ప్యాలెస్ అత్యధిక హోటల్ అదేవిధంగా పిల్లలకు కావలసిన గేమ్స్, తదితర టీ ప్యాలెస్ బేకర్ సౌకర్యాలను మంత్రి వాకిటి శ్రీహరి అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథి వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్క్ ప్యాలెస్ హోటల్ యాజమాన్యం హమీద్ షరీఫ్, అన్వర్ అహ్మద్, ఫైసల్ షరీఫ్, జైద్ అబ్దుల్లాలను వారు ప్రత్యేకంగా అభినందించారు. అరేబియన్ ఫుడ్, అదేవిధంగా అత్యంత ప్రాచీన ఆహారం, లభించేలా అతిపెద్ద సౌకర్యాలతో రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అదేవిధంగా పిల్లలకు పెద్ద ఎత్తున గేమ్స్ ప్రపంచాన్ని పరిచయం చేయడం అభినందనీయమని మంత్రి శ్రీహరి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలంతోపాటు మనం కూడా మారాల్సిన అవసరం ఉంటుందని ప్రజలకు కావలసిన అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంత పెద్ద వ్యవస్థను ఏర్పాటు చేయడం మన ప్రాంతంలో గొప్ప విషయం అని యజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్, సీనియర్ నేతలు అగనూరు విశ్వం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, కేకే కృష్ణ, వీర్లపల్లి సాజిద్, అన్వర్, మీడియా బృందం తదితరులు పాల్గొన్నారు

## కేపీహెచ్‌బీలో 'ఆనికా' డివైన్ డైమండ్ కలెక్షన్ ప్రదర్శన



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ ప్రఖ్యాత ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ ప్రత్యేక సహజ వజ్రాల ఆభరణాల సేకరణ 'ఆనికా'ను కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలోని స్ప్లెండర్ గోల్డ్ కలెక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రదర్శించనుంది. మే 23 నుంచి జూన్ 16 వరకు ఈ ప్రత్యేక కలెక్షన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దేవాలయ వాస్తుశిల్పం, పవిత్ర జ్యామితి, సాంప్రదాయ కళా రూపాల స్ఫూర్తితో రూపొందించిన ఈ కలెక్షన్‌లో సహజ వజ్రాలతో తయారైన నెక్లెస్‌లు, చెవిపోగులు, గాజులు, పెండెంట్లు తదితర ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పెళ్లిళ్లు, పండుగలు, ప్రత్యేక వేడుకల కోసం రూపొందించిన ఈ డిజైన్లు సంప్రదాయం, ఆధునికత కలయికగా మహిళలను ఆకట్టుకునేలా ఉంటాయని సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ వారసత్వ విలువలను పరిరక్షిస్తూ ఆధునిక అభిరుచులకు అనుగుణంగా 'ఆనికా' కలెక్షన్ రూపొందించామని తెలిపారు. సహజ వజ్రాల ప్రామాణికత, హస్తకళా నైపుణ్యం, ఆధునిక డిజైన్ల సమ్మేళనంగా ఈ కలెక్షన్ నిలుస్తుందని పేర్కొన్నారు. కస్టమర్లకు అంతర్జాతీయ ప్రమాణాలతో ధృవీకరించిన సహజ వజ్రాలు, పారదర్శక ధరలు, బైబ్యాక్ హామీ, జీవితకాల నిర్వహణ సేవలు, బంగారు ఆభరణాలపై పూర్తి మార్పిడి విలువ వంటి ప్రత్యేక సదుపాయాలు అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది.

## ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ



యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్లు హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం సైఫాబాద్‌లోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో దృష్టి వైకల్యం కలిగిన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో దివ్యాంగ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిబంధనలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సెంట్ ఆన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 44,205 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, మొదటి సెషన్‌లో 29,609 మంది పరీక్షకు హాజరయ్యారని, 14,596 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

# ఘనంగా వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ ప్రారంభం

* **530 మంది క్రీడాకారులతో జోష్‌గా ప్రారంభమైన జిల్లా స్థాయి పోటీలు**




వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఎస్ ఎల్ వి ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వికారాబాద్ జిల్లా నుంచి రికార్డు స్థాయిలో క్రీడాకారులు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, సభ్యులు సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, పీవీఎల్ కుమార్, ఏ.వి. రమణా రెడ్డిలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.అలాగే అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ జయంత్, ఎం. రామరాజు, సాయితేజలను అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.వారి సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఏడాది ఏకంగా 530 మంది క్రీడాకారులు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. ఈ స్థాయిలో పాల్గొనడం వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ యువ క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, క్రీడాకారులు విజయం సాధించాలనే లక్ష్యంతో తమ ప్రతిభను కనబరిచారు. అధికారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న నిర్వాహకులు, కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధుల కృషితో ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ప్రారంభమై క్రీడా వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# చిన్నారులతో డిప్యూటీ సీఎం ఉత్సాహంగా.. ఉల్లాసంగా



మధిర : మధిర మార్కెట్ యార్డు పరిశీలనకు వెళ్లిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడ క్రికెట్ ఆడుతున్న చిన్నారులతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. క్రికెట్ ఆడుతున్న చిన్నారులను తన దగ్గరకు పిలిచి, బ్యాటింగ్ ఎలా చేస్తున్నారు, బౌలింగ్ ఎవరెవరు చేస్తున్నారు, మీలో ఆల్‌రౌండర్లు ఎంతమంది ఉన్నారు అంటూ సరదాగా ప్రశ్నించారు. చిన్నారులు కూడా ఉపముఖ్యమంత్రితో వినయపూర్వకంగా, ఆనందంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడున్న వారిని పేరుపేరునా పలకరించి, కుశల ప్రశ్నలు అడిగి, చిన్నారులను ఆత్మీయంగా దగ్గరకు తీసుకున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తమిళనాడు మంత్రి పి.విశ్వనాథన్



హైదరాబాద్ : ఇటీవల తమిళనాడు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథన్ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ ను సీఎం రేవంత్ రెడ్డి సత్కరించి అభినందనలు తెలిపారు.

**ఢిల్లీలో ఖర్గేతో భేటీ అయిన మంత్రి వాకిటి శ్రీహరి**

ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేని ఆదివారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల అమలు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న పలు జల కేటాయింపుల అంశంపై ఖర్గేతో చర్చించిన వాకిటి శ్రీహరి చర్చించారు. కాగా.. ఇటీవల కేరళలో ఘన విజయం సాధించినందుకు ఖర్గేకి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.

# చిలపల్లి వరుస చోరీల కేసులను ఛేదించిన మెదక్ పోలీసులు

* **కోటి ముప్పై ఐదు లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల రికవరీ**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో వరుసగా జరిగిన చోరీల కేసులను మెదక్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దొంగిలించబడిన భారీ మొత్తంలో బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తూ ఈ నెల 14వ తేదీ రాత్రి గ్రామంలోని తాళం వేసిన ఐదు ఇండ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. సుమారు 109 తులాలు, 9 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, రూ.19 వేల నగదు అపహరించారు. మరో ఇంట్లో మూడు తులాల బంగారం దొంగిలించారు. ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి రామాయంపేట సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 929.7 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లూ నాయక్‌పై ఇప్పటికే పలు జిల్లాల్లో అనేక చోరీ కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. శంకరంపేటఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసులతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన మరో 12 కేసులను కూడా నిందితుడు ఒప్పుకున్నాడు. మొత్తం 17 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. నిందితులను వేగంగా పట్టుకున్నందుకు బాధితులు రాములు, మాణిక్ రెడ్డి జిల్లా ఎస్పీతో పాటు కేసు దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా బాధితుడు రాములు మాట్లాడుతూ తమ బంగారం మళ్లీ దొరుకుతుందని ఆశించలేదని, దొంగతనం జరిగినప్పటి నుంచి పోలీసులు అండగా నిలిచి ధైర్యం చెప్పారని తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి కేసును ఛేదించిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో విశేషంగా కృషి చేసిన ఐదు ప్రత్యేక బృందాల సిబ్బందికి రివార్డులు, నగదు పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు రేణుక రెడ్డి, జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్ రెడ్డి, పోచయ్య, సీసీఎస్ బృందం, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

* **70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన యూనియన్లో ఉండటం గర్వకారణం**
* **టియూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) నిరంతరం పోరాటాలు సాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అన్నారు. టియూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ పూర్వ అధ్యక్షులు ఇమ్మంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా మృతి చెందిన జర్నలిస్టు మిత్రుల జ్ఞాపకార్థం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన జర్నలిస్టు యూనియన్ సభ్యులుగా ఉండటం మనందరి అదృష్టమన్నారు. ఆ నాటి నుండి నేటి వరకు యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో బలమైన యూనియన్గా ఉందని, దేశంలోనే నెంబర్ వన్ సంఘంగా ముందుకు దూసుకుపోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల కోసం నిరంతరం ప్రభుత్వానికి వినతులు అందిస్తూనే ఉన్నామని, ఉమ్మడి తెలుగు రాష్ట్రం వ్యాప్తంగా ఇప్పటికే 47 వేల అక్రిడేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధి అయిన జర్నలిజం వృత్తి ఎంతో పవిత్రమైందని, అలాంటి వృత్తి కొందరి కారణంగా దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తికే కళాంకాన్ని తెచ్చే కలుపు మొక్కల భరతం పట్టాలని చెప్పారు. బ్లాక్ వెతికిపట్టుకుని వృత్తి నుండి తప్పించాలన్నారు. సమాజాన్ని జాగృతం చేయాలనే తపన జర్నలిస్టుల మదిలో అనునిత్యం ఉండాలని, అలాంటి వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి టియూడబ్ల్యూజే (ఐజేయు) నిత్యం ముందడుగులో ఉంటుందని, వృత్తిలో ఎదురయ్యే ఆటుపోట్లకు జర్నలిస్టులు భయపడకుండా నిజాన్ని నిర్భయంగా బహిర్గతం చేయాలన్నారు. కత్తిమీద సాములాంటిది ఇ జర్నలిస్టు వృత్తని, అలాంటి జర్నలిస్టులు సమాజ మేలుతో పాటు తమ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేయాలని టియూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కే రామ్నారాయణ అన్నారు. అనగారిన వర్గాల గొంతుకగా జర్నలిస్టులు ఉన్నారని, అలాంటి జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డుల కోసం యూనియన్ తొలినాళ్ల నుండి రాజీలేని పోరాటం సాగిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నోచుకోక పోవడంతో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్మంతర వద్ద మన గళం వినిపించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డితో కలిసి యూనియన్ అధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు వివరించామని, వాటి పరిష్కారానికి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి సాగుతోందని, నూతనంగా ఏర్పాటైన జిల్లా కార్యవర్గం ప్రతీ మూడునెలలకోసారి సమావేశాలు, సెమినార్లు నిర్వహించుకోవాలని, నానాటికి పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకుని వృత్తిలో నైపుణ్యాన్ని మరింతగా పెంచుకోవాలని సూచించారు.

* **టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులుగా రత్నం**

టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులుగా జాగు వెంకట రత్నం, ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్, కోషాధికారిగా శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా 3వ మహాసభ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్లో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు సాగిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల విలేకరుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రతీ మూడు నెలలకు ఓ సారి కమిటీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని మరింతగా మెరుగువురుచుకునేందుకు సెమినార్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో యూనియన్ బలోపేతానికి కలిసికట్టుగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కోశాధికారితో పాటు తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరహత్ అలీ, రామ్నారాయణ, జర్నలిస్టు నాయకులు వేణు, వెంకట్రావు. ఏనుగు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తో పాటు జిల్లాలోని జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని కూడా ఈసందర్భంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్ నవీన్, ప్రధాన కార్యదర్శిగా జి నాగచంద్ర, కోషాధికారిగా ఎన్ రాజేష్ తో పాటు ఉపాధ్యక్షులుగా ప్రభుదాస్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా టి. రవికుమార్, శ్రీహరితో పాటు మరో 13 మందిని ఇసి మెంబర్స్గా ఎనుకున్నారు.

# అర్ధరాత్రి రేసింగ్ బైకులు, కార్లతో హల్‌చల్

* **అర్ధరాత్రి రేసింగ్ బైకులు, కార్లతో హల్‌చల్**
* **వీకెండ్‌లో ఐటీ కారిడార్, ఓఆర్ఆర్‌పై బీభత్సం**
* **అడ్డుకోబోయిన పోలీసులపైకి వాహనాలు**




శేరిలింగంపల్లి: నిత్యం లక్షలాది వాహనాలతో రద్దీగా ఉండే హైదరాబాద్‌లో పగలు ప్రశాంతంగా కనిపించే రోడ్లు, రాత్రి కాగానే కొందరు పోకిరీల పాలిట రేసింగ్ ట్రాక్‌లుగా మారుతున్నాయి. ఐటీ కారిడార్, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ లగ్జరీ కార్లు, స్పోర్ట్స్ బైకులతో కొందరు యువకులు నిర్వహిస్తున్న రేసింగ్‌లు నగరవాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

**సైలెన్సర్లను పీకేసి**

సాధారణ రోజులతో పోలిస్తే వీకెండ్స్‌లో రాయదుర్గం, నాలెడ్జ్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లను ఈ రేసర్లు అడ్డాగా మార్చుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత టెకీలు ఎక్కువగా రాకపోకలు సాగించే మార్గాల్లో, విశాలమైన రోడ్లపై వీరు పందాలకు దిగుతున్నారు. వాహనాలకు ఉన్న ఒరిజినల్ సైలెన్సర్లను పీకేసి, భారీ శబ్దాలు వచ్చేలా మోడిఫైడ్ సైలెన్సర్లను అమరుస్తున్నారు. సైలెన్సర్ల సౌండ్‌లతో, టైర్ల రాపిడితో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

**పోలీసులకే రక్షణ కరువు**

ఈ రేసర్ల ఆగడాలు కేవలం సామాన్యులను భయపెట్టడానికే పరిమితం కాలేదు. డబ్బు, పలుకుబడి మత్తులో చట్టం అంటేనే వీరికి ఏమాత్రం భయం లేకుండా.. తమ రేసింగ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులపైనే వారు ప్రతాపం చూపుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను ఆపేందుకు యత్నించిన కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ పోలీసు సిబ్బందిపైకి ఏమాత్రం వెనుకాడకుండా కార్లను దూకించి ప్రాణాలు తీసేందుకు సైతం బరితెగిస్తున్నారు. పోలీసుల ప్రాణాలకే రక్షణ కరవైన ఇలాంటి ఘటనలు నగరంలో కలకలం రేపుతున్నాయి.

**కానిస్టేబుల్‌కు గాయాలు**

రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని టీహబ్ వద్ద బైక్‌లు, కార్లతో పోకిరీలు హల్‌చల్ సృష్టించారు. పోలీసులు కారు ఆపే ప్రయత్నంలో ఓ కానిస్టేబుల్ చేతి వేళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మిగతా ముగ్గురు పరారయ్యారు. వారి ఆచూకీ తెలుసుకొని అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. వాహనదారులను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేసారు.

**200 కిలోమీటర్ల వేగం**

ఔటర్ రింగ్ రోడ్‌పై 10వ తేదీ ఉదయం వోక్స్‌వ్యాగన్ విర్టస్ కారు (తాత్కాలిక నెంబర్ టీజీటీఆర్ 2026)తో నార్సింగి టోల్ ప్లాజా నుంచి పోలీసు అకాడమీ టోల్ ప్లాజా వైపు ఓ వ్యక్తి గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో నిర్లక్ష్యంగా నడిపాడు. ర్యాష్ డ్రైవింగ్‌ను మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశాడు. రోడ్ పెట్రోలింగ్ ఆఫీసర్ కారింగుల సాయిరాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడు కొత్తపల్లి యశ్వంత్ రెడ్డిని అరెస్టు చేశారు.

# వెంకటాపురంలో అగ్నికి ఆహుతైన జామాయిల్ తోటలు

ఎర్రుపాలెం : మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగూడెం రెవెన్యూలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో జామాయిల్ తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ట్రాన్స్ఫర్మర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం, పొలాల్లో హై ఓల్టేజ్ లైన్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి మొత్తం పది మంది రైతులకు చెందిన సుమారు ముప్పై ఎకరాల జామాయిల్ తోటలు మంటల్లో కాలిపోయాయి. ఈ ఘటనలో జామాయిల్ తోటలకు సుమారు నలభై లక్షలు రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అగ్నిప్రమాదం కారణంగా పూర్తిగా ఆర్థికంగా దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించటం జరిగిందని వారు వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# దివిసీమ ఉప్పెన సమయంలో దత్తాత్రేయ సేవలు ఎనలేనివి: ఒడిశా గవర్నర్ హరిబాబు






విశాఖపట్నం: ప్రజల మధ్య నుంచి వచ్చిన మహోన్నత వ్యక్తి బండారు దత్తాత్రేయ అని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో రూపొందించిన ఆత్మీయ అవలోకనం పుస్తకావిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హరిబాబుతో పాటు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు హాజరయ్యారు. తల్లి ధైర్యమే దత్తాత్రేయను ఈ స్థాయికి తీసుకొచ్చిందని.. కష్టాలు ఆయన విజయాన్ని ఆపలేకపోయానని హరిబాబు అన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో దత్తాత్రేయ సేవలు ఎనలేనివన్నారు. దత్తాత్రేయ జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో సంఘ్ పరివార్ నేతృత్వంలో సేవలందించారని చెప్పారు. పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి బండారు దత్తాత్రేయ అని జీవీఎల్ నరసింహారావు అన్నారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఉత్తరాంధ్రలోనూ నిర్వహించాలని.. వివిధ పార్టీల నేతలందరినీ ఒకే వేదికపై నిలపాలని కోరారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాజకీయాలు అంటే ప్రజా సేవ మాత్రమేనని.. తాను అదే నమ్ముతానని చెప్పారు. రాజకీయాల్లో రోజురోజుకీ విలువలు పతనమవుతున్నాయన్నారు. అయితే ఇప్పటికీ ఉన్నత విలువలు ఉన్న నేతలు ఉన్నారని చెప్పారు. భిన్న ఆలోచనలు ఉన్న వారిందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషమని దత్తాత్రేయ అన్నారు.






## రోడ్డు ప్రమాదంలో అన్న మృతి..
## తమ్ముడి పరిస్థితి విషమం

బద్వేల్ పట్టణం: ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించుకొని వస్తున్న కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా.. తమ్ముడు మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన కుటుంబం.. పోరుమామిళ్ల రంపాడు రోడ్డులోని ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు వెళ్లింది. కొందరు కారులో బయల్దేరగా.. అన్నదమ్ములు సుభాష్ శివసాయిరాం, సాయి సునీల్ బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరి బైక్ బి.కోడూరు మండలంలోని రామచంద్రపురం గ్రామ సమీపంలో ఎంపీపీ పాఠశాల వద్ద బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుభాష్ శివసాయిరాం అక్కడికక్కడే మృతి చెందగా.. సాయి సునీల్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తిరుమలలో బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు...
# దర్శనానికి 30 గంటలు

* తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ
* శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం
* బాట గంగమ్మ ఆలయం వరకు చేరిన క్యూలైన్లు
* నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు
* నిన్న శనివారం 97 వేల మందికి పైగా స్వామివారి దర్శనం



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూలైన్లు బయటకు ఏకంగా బాట గంగమ్మ ఆలయం వరకు పొడిగించారు. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టీటీడీ అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. టీటీడీ గణాంకాల ప్రకారం, మే 23వ తేదీ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే రోజున శ్రీవారి హుండీకి రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

## ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు: ఉత్తమ్‌కుమార్ రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశామని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు రూ.45వేల కోట్లు చెల్లించామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. "తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దు. వర్షాలతో ధాన్యం తడిచినా కొనాల్సిందే. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి.. వాటికి కొరత లేదు" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.




## ఎబోలా ఎఫెక్ట్..
## ఎయిర్‌పోర్టులపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అమరావతి: ఆఫ్రికాలో ఎబోలా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. కాంగో, ఉగాండా, సూడాన్ నుంచి వచ్చేవారికి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించింది. విశాఖ, తిరుపతి, విజయవాడ విమానాశ్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎబోలాపై అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఓడరేవులతో పాటు రోడ్డు మార్గాల్లోనూ దృష్టి సారించాలని చెప్పారు. వైరస్ లక్షణాలున్న వారిని క్వారంటైన్ చేస్తామని మంత్రి తెలిపారు.


## ఐఎస్ఐలో చేరేందుకు యత్నం.. మేడ్చల్‌లో యువకుడి అరెస్టు

మేడ్చల్: ఉగ్రవాద గ్రూపుల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని యూపీలోని గాజియాబాద్‌కు చెందిన జయిాద్‌ఖాన్‌గా గుర్తించారు. మేడ్చల్‌లోని ముబారక్ హోటల్‌లో పని చేస్తున్న అతడు.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఉగ్రవాద సంస్థలను ఫాలో అవుతున్నాడు. కొన్నాళ్లుగా ఉగ్రమూకలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడు. పాక్ ఐఎస్ఐలోనూ చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జయిాద్‌ఖాన్ సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టి పట్టుకున్నారు. అతడి నుంచి నకిలీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




## మొక్క జొన్న కొనుగోళ్లపై సీఎం కీలక నిర్ణయం: మంత్రి తుమ్మల

హైదరాబాద్: మొక్క జొన్న కొనుగోళ్లపై కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన రూ.4వేల కోట్లకు అదనంగా మరో రూ.1800 కోట్లు.. సీఎం కేటాయించారని చెప్పారు. ఈ ఏడాది రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న భారీ దిగుబడుల వచ్చిన నేపథ్యంలో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రూ.1100 కోట్లతో మొక్క జొన్న కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. పొద్దుతిరుగుడు పంట 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాల వారీగా మొక్కజొన్న కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల స్పష్టం చేశారు.



## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు.. కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

* వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్
* ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ
* మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య
* గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ



తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

## చెట్టును ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకుల మృతి

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో విక్రమ్ (27), అనిల్ (30) మృతి చెందారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి: ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ట్విష భౌతికకాయానికి రెండోసారి పోస్ట్‌మార్టం.. అంత్యక్రియలు పూర్తి

భోపాల్‌లో అత్తవారింట్లో ఆత్మహత్య చేసుకున్న నటి ట్విషా శర్మ మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం పూర్తయ్యింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు దిల్లీ ఎయిమ్స్ నిపుణుల బృందం మరోసారి శవ పంచనామా నిర్వహించింది. అనంతరం మృతదేహాన్ని ట్విష కుటుంబీకులకు అప్పగించగా.. భోపాల్‌లోని ఓ ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. నోయిడాకు చెందిన ట్విషా శర్మ.. మే 12వ తేదీన భోపాల్‌లో అత్తవారింట్లో ఉరివేసుకొని కనిపించింది. వివాహమైన ఐదు నెలలకే చనిపోవడం అనుమానాలకు కారణమైంది. వరకట్నం కోసం ఆమె భర్త సమర్థ్ సింగ్, అత్త గిరిబాలా సింగ్ (విశ్రాంత న్యాయమూర్తి) వేధించారని, ఆత్మహత్యకు పురిగొల్పారని ట్విష తల్లిదండ్రులు ఆరోపించారు. అంతేకాదు.. ఆమె మరణంపై అనుమానాలు ఉన్నాయని, మరోసారి పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు మృతదేహాన్ని తీసుకెళ్లే ప్రసక్తే లేదన్నారు. తమ కుమార్తె మరణాన్ని ఆత్మహత్య కేసుగా చూడొద్దని, ఈ ఘటనలో సునిశితమైన ఫోరెన్సిక్ పరిశీలన అవసరమని పేర్కొంటూ మధ్యప్రదేశ్ హైకోర్టును




ఆశ్రయించారు. న్యాయస్థాన ఆదేశాల మేరకు నలుగురు నిపుణుల దిల్లీ ఎయిమ్స్ బృందం.. మరోసారి పోస్ట్‌మార్టం నిర్వహించింది. ఈ వ్యవహారంలో ట్విష భర్త, అత్తపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే, ఘటన తర్వాత దాదాపు 10 రోజులుగా పరారీలో ఉన్న ఆమె భర్తను మే 22న పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక న్యాయస్థానం అతడిని ఏడు రోజుల పోలీస్ కస్టడీకి ఆదేశించింది. మరోవైపు, ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుంది. సోమవారం విచారించే అవకాశం ఉంది.



# ఆల్చిప్పల కోసం నదిలో దిగి.. ఒకే కుటుంబంలోని 8మంది మృతి

బెంగళూరు (చిత్రదుర్గం): కర్ణాటకలోని తత్తెహక్కలు నదిలో వేటకు దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. జాలర్ల సాయంతో 8మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 7మంది మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో నదిలో ఆల్చిప్పలు విరివిగా దొరుకుతాయి. దీంతో భత్కళ తాలూకా సిరాలి గ్రామానికి చెందిన ఓ కుటుంబం (14మంది) ఉదయం 10గంటల సమయంలో ఆల్చిప్పల కోసం నదిలోకి దిగారు. అదే సమయంలో నది ప్రవాహం పెరగడంతో వారిలో ముగ్గురు కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా మిగిలిన వారు కూడా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వెంటనే స్థానిక జాలర్లు నదిలోకి దిగి ముగ్గురిని రక్షించారు. అప్పటికే మిగిలిన వారు గల్లంతయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



# ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలిసి నడుస్తాం

**: రూబియో**

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఆ దేశ బృందం భారత్‌కు రాబోతోందని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తెలిపారు. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి రూబియోతో చర్చల అనంతరం.. దిల్లీలో సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. అమెరికాతో ఒప్పందంలోని కొన్ని అంశాలపై భారత్ అభ్యంతరం చెబుతోందన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. గల్ఫ్ సంక్షోభం, రష్యా ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించినట్లు రూబియో వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ అమెరికా కలిసి నడుస్తాయన్నారు. ''భారత్, అమెరికా రెండూ ఉగ్రవాద బాధిత దేశాలే. ఈ రెండూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు. వ్యూహాత్మక భాగస్వాములు. భారత్‌లో పర్యటించడం గర్వంగా ఉంది'' అని అమెరికా విదేశాంగ మంత్రి అన్నారు.

**ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారు..**

అమెరికా వలసదారులకు మిత్రదేశమని మార్కో రూబియో బలంగా చెప్పారు. అగ్రరాజ్యంలో భారతీయులపై వివక్ష చూపటాన్ని మూర్ఖుల చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారని.. వారు దేశానికి ఉన్న విస్తృతమైన విధానాలకు ప్రాతినిధ్య వహించరని పేర్కొన్నారు. ఈ విషయంలో భారతీయుల ఆందోళనలను సీరియస్‌గా తీసుకొంటామని పేర్కొన్నారు. ''వీటికి ఎలా స్పందించాలో అర్థం కావడంలేదు. కానీ, వీటిని తీవ్రంగా పరిగణిస్తాము'' అని పేర్కొన్నారు. అమెరికా సమాజాన్ని , ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో భారతీయుల పాత్రను ఆయన కొనియాడారు. భారతీయులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు 20 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చిన విషయాన్ని తాను అంగీకరిస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ అంకె ఇంకా పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

# వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మలేం: ఉదయనిధి



డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆ పార్టీ తమను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. గత 20ఏళ్లుగా ఆ పార్టీ తమపై ఆధారపడి ఉందని.. ఈ రోజు అధికారం కోసం టీవీకేతో చేతులు కలిపిందని విమర్శించారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మర్చిపోవద్దని.. ఆ పార్టీ నేతలను భవిష్యత్తులో తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదని సూచించారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందని మరోసారి రుజువయ్యిందన్నారు. దేశంలో భాజపా వరుస విజయాలకు ప్రధాని మోదీ, అమిత్ షాలే ప్రధాన కారణమని తాను ఇన్నాళ్లు భావించానని.. కానీ అది నిజం కాదని ఉదయనిధి అన్నారు. కాంగ్రెస్ నేతల అసమర్థత వల్లే ప్రజలు భాజపాకు పట్టం కడుతున్నారని.. అది ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. డీఎంకేతో పొత్తు వల్లే గతంలో కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా డీఎంకే కార్యకర్తల అవిశ్రాంత కృషి వల్లే ఆ పార్టీ ఐదు సీట్లు గెలుచుకోగలిగిందన్నారు. ఆ విశ్వాసం కూడా లేకుండా కాంగ్రెస్ నేతలు గెలిచిన వెంటనే అధికారం కోసం పరుగులు తీశారని మండిపడ్డారు.

# ఫల్టా రీపోలింగ్.. లక్ష ఓట్ల మెజార్టీతో భాజపా అభ్యర్థి గెలుపు

పశ్చిమ బెంగాల్‌లోని ఫల్టా నియోజకర్గానికి ఇటీవల రీపోలింగ్ నిర్వహించగా నేడు ఫలితం వెల్లడైంది. ఇందులో భాజపా అభ్యర్థి దెబాంగ్‌షూ పాండా లక్షా తొమ్మిది వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ప్రాంతంలో ఆ పార్టీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ నాలుగో స్థానానికి పరిమితం కావడం గమనార్హం. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు ఖాన్



ప్రకటించిన విషయం తెలిసిందే. ఫల్టా నియోజకవర్గంలో మొత్తం 2.36లక్షల ఓటర్లు ఉన్నారు. తాజా రీపోలింగ్ ఫలితాల్లో భాజపా అభ్యర్థి పాండాకు మొత్తం 1.49లక్షల ఓట్లు రాగా.. సీపీఎం అభ్యర్థి శంభూ నాథ్ కుర్మీ 40వేల ఓట్లు సాధించి రెండోస్థానంలో నిలిచారు. కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. 2011 నుంచి ఇక్కడ టీఎంసీ అభ్యర్థి గెలుస్తుండగా.. తాజా ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి కేవలం 7వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. ఫల్టా నియోజకవర్గంలో ఆందోళనలు జరిగాయి. ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం తమకు భద్రత కల్పించాలని డిమాండు చేస్తూ స్థానిక ఓటర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పరిస్థితిని సమీక్షించిన ఎన్నికల సంఘం (Election Com mission).. ఫల్టా మొత్తం రీపోలింగ్‌కు నిర్ణయించింది. ఇలా ఒక నియోజకవర్గం మొత్తం రీపోలింగ్‌కు ఆదేశించడం ఈసీ చరిత్రలో అత్యంత అరుదైన విషయం

# షాపింగ్ కో హెల్పర్.. దిల్లీ స్టార్టప్‌పై నెట్టింట చర్చ


రద్దీగా ఉండే మార్కెట్లలో షాపింగ్ చేసేవారికి సాయపడేందుకు దిల్లీలో 'క్యారీమెన్' (Car ryMen) అనే స్టార్టప్ సంస్థ పుట్టుకొచ్చింది. మీరు మార్కెట్లో షాపింగ్ చేస్తుంటే.. ఆ సంస్థకు చెందిన సహాయకులు మీ వెంటే ఉంటూ షాపింగ్ బ్యాగులు మోయడంలో సాయపడతారు. అయితే, ఈ స్టార్టప్ సేవలపై నెట్టింట చర్చమొదలైంది. కొందరు ఫన్నీగా స్పందిస్తుండగా.. మరికొందరు మాత్రం ఈ సేవలను తప్పుపడుతున్నారు. షాపింగ్ సమయంలో బ్యాగులు మోయడమే కాదు.. మీతో పాటు పార్కింగ్ ఏరియా లేదా మెట్రో స్టేషన్ వరకు రావడం, ఫుడ్ కౌంటర్ల దగ్గర మీ బదులు క్యూలో నిల్చోవడం వంటి పనులు కూడా చేస్తారు ఈ సంస్థ సిబ్బంది. ఇందుకు గానూ గంటకు రూ.149 తీసుకుంటారు. బేబీ క్యారియర్, మొబైల్ ఛార్జింగ్, గొడుగు, మడత కుర్చీ వంటి సేవలను కూడా అందిస్తున్నారు. దీనికి అదనంగా చెల్లించాలి. అయితే, ఈ సేవలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'మా అమ్మకు ఈ విషయం తెలిస్తే నా ప్లేస్‌లో వీరిని పెట్టేసుకుంటుంది' అంటూ ఒకరు సరదాగా కామెంట్ చేయగా.. 'భర్త ఉండగా.. ఈ క్యారీమెన్ ఎందుకు?' అంటూ మరొకరు ఫన్నీగా కామెంట్ చేశారు. 'మా ఊర్లోనూ ఇలాంటి సేవలున్నాయి..




కాకపోతే టీషర్టులు వేసుకోరంతే' అంటూ మరో వ్యక్తి రాసుకొచ్చాడు. 'ఈ ప్లాట్‌ఫామ్ కమీషన్లు పోను ఈ పని చేసే కార్మికులకు చేతికి ఎంత దక్కుతుందో' అంటూ ఓ వ్యక్తి ఆందోళన వెలిబుచ్చాడు. 'మానవ వనరులను ఇలాంటి వాటికి ఉపయోగించడం సరైనదేనా?' అంటూ మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

# 'డిజిటల్ అరెస్టు'తో.. వృద్ధురాలి నుంచి రూ.24 కోట్లు లూటీ

డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వృద్ధురాలి నుంచి రూ.కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లను బెంగళూరు సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.24 కోట్ల నగదును నేరగాళ్లు దోచుకున్నట్లు గుర్తించారు. సైబర్ కేటుగాళ్లకు చెల్లించేందుకు బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టేందుకు బాధితురాలు బ్యాంకుకు వెళ్లగా.. సిబ్బంది అనుమానించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. బెంగళూరులోని (Bengaluru) శివాజీనగర్‌కు చెందిన ఓ వృద్ధురాలికి (74) ఇటీవల ఆస్తి విక్రయించడం ద్వారా భారీ మొత్తంలో నగదు సమకూరింది. ఈ విషయాన్ని పసిగట్టిన సైబర్ నేరగాళ్లు.. మనీలాండరింగ్ కేసు పెడతామంటూ ఆమెను బెదిరించడం మొదలుపెట్టారు. దీంతో భయాందోళనలకు గురైన ఆమె.. జనవరి నుంచి మే నెల మధ్య కాలంలో దాదాపు రూ.24 కోట్లను



వారి ఖాతాలకు బదిలీ చేశారు. అక్కడితో ఆగని మోసగాళ్లు.. మరింత నగదు కోసం నేరగాళ్లు డిమాండ్ చేశారు. దీంతో తన వద్ద ఉన్న దాదాపు 1.3 కిలోల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టేందుకు బాధితురాలు బ్యాంకుకు వెళ్లారు. అయితే, ఈ మధ్య ఆమె ఖాతా నుంచి భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన మేనేజర్.. అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు వృద్ధురాలిని విచారించారు. భయంతో తొలుత అసలు విషయాన్ని దాచినప్పటికీ.. చివరకు 'డిజిటల్ అరెస్ట్' (Dig ital Arrest) గురించి ఆమె పోలీసులకు వివరించారు. వెంటనే కేసు నమోదు చేసుకున్న అధికారులు.. ఈ విషయాన్ని విదేశాల్లో ఉన్న బాధితురాలి కుటుంబీకులకు తెలియజేశారు. ఈ కేసును తీవ్రంగా పరిగణించి ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముంబయి, అలహాబాద్, దిల్లీలకు చెందిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దోచుకున్న నగదును దాదాపు 22 ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. దాదాపు రూ.60లక్షలను ఫ్రీజ్ చేసిన అధికారులు.. మిగతా నగదు రికవరీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

# కీవ్‌పై.. శక్తిమంతమైన 'ఒరెష్నిక్' హైపర్ సోనిక్ క్షిపణితో రష్యా దాడి!

ఉక్రెయిన్ రాజధాని కీవ్ రీజియన్‌పై డ్రోన్లు, క్షిపణితో రష్యా మరోసారి విరుచుకుపడింది. బిలా సెర్క్వా నగరంపై ఆదివారం ఉదయం జరిపిన దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడోసారి మాత్రమే కావడం గమనార్హం. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా మండిపడ్డారు. సాధారణ పౌరులే లక్ష్యంగా రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడిందని.. అందులో శక్తిమంతమైన హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణులను ప్రయోగిస్తోందని ఆరోపించారు. అయితే, దీనిపై ఇప్పటి వరకు రష్యా స్పందించలేదు.

**ఏమిటీ ఒరెష్నిక్ క్షిపణి..?**

ఒరెష్నిక్ అనేది హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి. రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒకటైన ఈ మిస్సైల్.. గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా



దూసుకెళ్తుంది. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. యూరప్‌లోని అన్ని దేశాలు ఈ క్షిపణి పరిధిలోకి వస్తాయని , దీన్ని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని రష్యా గతంలో ప్రకటించింది. తొలిసారిగా దీనిని 2024 నవంబరులో ఉక్రెయిన్ నగరమైన డినిప్రోలోని ఓ ఫ్యాక్టరీ మీద రష్యా ప్రయోగించింది. అప్పట్లో అది అభివృద్ధి దశలోనే ఉంది. ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు సమాచారం. ఉక్రెయిన్‌లోని పశ్చిమ లీవ్ ప్రాంతంలో రష్యా రెండోసారి ఈ క్షిపణి ఉపయోగించగా.. తాజాగా కీవ్ రీజియన్‌పై మూడోసారి ప్రయోగించింది.

# 60రోజుల పాటు హర్మూజ్‌ను తెరవనున్న ఇరాన్

ఇరాన్‌అమెరికా మధ్య యుద్ధం ముగింపు చర్చలు వేగవంతమయ్యాయి. ఏ క్షణంలో అయినా ఈ విషయంపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇరుదేశాలు 60 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరుపుతున్నట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఇందులో హర్మూజ్‌ను 60 రోజులపాటు తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమాలను నిలిపివేయడం వంటి అంశాలు ఉన్నట్లు పేర్కొంది. ఒప్పందంలో భాగంగా జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించడానికి ఇరాన్ అంగీకరించినట్లు తెలిపింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తన దిగ్బంధనాన్ని ఎత్తివేస్తుందని.. దీంతో ఇరాన్ సైతం స్వేచ్ఛగా ప్రపంచ దేశాలకు చమురును విక్రయించుకోగలదని పేర్కొంది.

# బయటి దొరికే ఫుడ్ ఇప్పుడు ఇంట్లోనే...

వానాకాలంలో చిరుతిళ్ల తినడం బాగా ఎంజాయ్ చేస్తారు. అయితే, అలాగని బయటి ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది ఎలాగా? అని ఆలోచిస్తుంటారు. అయితే, బయట దొరికే ఫుడ్‌ని ఇలా ఇంట్లోనే ఈజీగా చేసుకోండి.





## ఎగ్ పఫ్

**కావాల్సినవి**

- గోధుమ పిండి – రెండు కప్పులు
- కోడిగుడ్లు (ఉడికిన) – నాలుగు
- ఉప్పు, నీళ్లు, నూనె – సరిపడా
- వెన్న – మూడు టీస్పూన్లు
- పచ్చిమిర్చి – మూడు
- ఉల్లిగడ్డలు, టొమాటోలు – రెండేసి చొప్పున
- కారం – ఒక టీస్పూన్
- పసుపు – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- గరం మసాలా – ఒక టీస్పూన్
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, వెన్న వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. దాన్ని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టాలి. తర్వాత ఒక గిన్నెలో పెట్టి మూతపెట్టి పక్కనపెట్టాలి. ఒక పాన్‌లో నూనె వేడి చేసి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, టొమాటో తరుగు, ఉప్పు వేసి వేగించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలపాలి. ఆ తర్వాత గిన్నెలో పెట్టిన పిండిని తీసి, ఉండలు చేయాలి. వాటిని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టి మరోసారి వత్తాలి. ఇలా మూడు లేదా నాలుగు సార్లు చేశాక, నాలుగు భాగాలుగా కట్ చేయాలి. ఒక్కోదాంట్లో రెడీ చేసిన స్టఫింగ్ దాంతోపాటు సగానికి కోసిన కోడిగుడ్డు పెట్టి మూసేయాలి. ఇడ్లీ ప్లేట్‌కి నూనె రాసి, వాటిని అందులో పెట్టాలి. మరో పాన్‌లో చిన్న గిన్నె బోర్లించి, దానిపై ఇడ్లీ ప్లేట్ పెట్టి మూతపెట్టాలి. కాసేపటి తర్వాత మూత తీసి, వాటిని రెండోవైపు తిప్పి పెట్టాలి. మళ్లీ మూతపెట్టి ఉడికించాలి



## మసాలా కార్న్ టోస్ట్

**కావాల్సినవి**

- నూనె – రెండు టేబుల్ స్పూన్లు
- వెల్లుల్లి తరుగు – ఒక టేబుల్ స్పూన్
- ఉల్లిగడ్డ తరుగు – ఒక కప్పు
- జీలకర్ర పొడి – అర టీస్పూన్
- పచ్చిమిర్చి – ఒకటి
- కారం – ఒక టీస్పూన్
- గరం మసాలా – పావు టీస్పూన్
- ఫ్రెష్ క్రీమ్ – అర కప్పు
- చీజ్ – అర కప్పు
- కొత్తిమీర – కొంచెం
- వెన్న – ఒక టీస్పూన్
- బ్రెడ్ ముక్కలు – ఆరు

**తయారీ :** పాన్‌లో నూనె వేడి చేసి, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, మొక్కజొన్న గింజలు ఒకదాని తర్వాత ఒకటి వేసి వేగించాలి. అందులో కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, ఫ్రెష్ క్రీమ్, చీజ్ కూడా ఒక్కటిగా వేస్తూ కలపాలి. ఆ తర్వాత పాన్‌లో వెన్న వేడి చేసి బ్రెడ్ ముక్కని అందులో పెట్టాలి. దానిపై కార్న్ మిశ్రమం పెట్టి, చీజ్ చల్లి మూతపెట్టి కాసేపు ఉడికించాలి. తర్వాత బ్రెడ్ ముక్కల్ని కట్ చేసి, కొత్తిమీర తరుగు చల్లాలి.





## ఆలూ మటర్ పఫ్

**కావాల్సినవి**

- గోధుమ పిండి – ఒక కప్పు
- నూనె, ఉప్పు, నీళ్లు – సరిపడా
- వాము – అర టీస్పూన్
- జీలకర్ర – అర టీస్పూన్
- పసుపు – అర టీస్పూన్
- గరం మసాలా – అర టీస్పూన్
- మొలకెత్తిన పచ్చి బఠానీ – ఒక కప్పు
- పచ్చిమిర్చి – మూడు
- ఆలుగడ్డ, ఉల్లిగడ్డ – ఒక్కోటి
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- నిమ్మరసం – ఒక టీస్పూన్
- కార్న్ ఫ్లోర్ – నాలుగు టేబుల్ స్పూన్లు

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, వాము, నూనె, ఉప్పు వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. మూతపెట్టి పది నిమిషాలు పక్కన పెట్టాలి. మిక్సీజార్‌లో మొలకెత్తిన పచ్చి బఠానీ, పచ్చిమిర్చి, ఆలుగడ్డ తరుగు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. పాన్‌లో నూనె వేడి చేసి, జీలకర్ర, ఉల్లిగడ్డ తరుగు వేసి వేగించాలి. ఆ తర్వాత అందులో ఆలూ బఠానీ మిశ్రమం కూడా వేసి కలపాలి. అందులో నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి. ఆపై పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, నూనె వేసి పేస్ట్‌లా కలపాలి. రెడీ చేసిన పిండి ముద్దను ఉండలు చేసి, చపాతీల్లా వత్తాలి. ఒక్కో చపాతీకి ఆ పేస్ట్ పూసి, పిండి చల్లాలి. అలా నాలుగైదు చపాతీలను ఒకదానిపై ఒకటి పేర్చాలి. తర్వాత వాటన్నింటిని రోల్‌లా చుట్టి, రింగులుగా కట్ చేయాలి. వాటిని మరోసారి చపాతీల్లా వత్తి, నాలుగు ముక్కలుగా కట్ చేసి, ఒక్కోదాంట్లో ఆలూ బఠానీ స్టఫ్ పెట్టి, మూసేయాలి. అలా చేసిన వాటిని వేడి నూనెలో వేగిస్తే ఆలూ మటర్ పఫ్ రెడీ.






# కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే...


కోపంలో ఫ్రస్టేషన్, బాధ, అలగడం, దిగులు వంటివి కూడా ఉంటాయి. కోపం ఎక్స్‌ప్రెస్ చేసే విధానాన్ని బట్టి రిజల్ట్ వస్తుంది. అప్పుడప్పుడు చిరాకు, కోపం, విసుగు వంటివి రావడం సహజమే. మరి దీన్నుంచి బయటపడేదెలా?

- కోపం వస్తే.... మొదట చేయాల్సిన పని డీప్ బ్రీత్ తీసుకోవడం. కోపం తగ్గేవరకూ నిదానంగా శ్వాస తీసుకుంటూ... వదులుతూ ఉండాలి. తర్వాత మనలో మనం పాజిటివ్‌గా మాట్లాడుకోవాలి.
- కోపం ఎప్పుడు వచ్చినా దాన్ని ఎక్స్‌ప్రెస్ చేయకపోవడమే మంచిది. ఒకవేళ కోప్పడాల్సి వస్తే దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసే విధానంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి చిన్న చిన్నవాటికే ఎక్కువ కోపం చూపిస్తే అవి రిలేషన్‌షిప్ మీద ఎఫెక్ట్ చూపిస్తాయి.
- మీకు సపోర్ట్ చేసే వాళ్లకి మీ ఫీలింగ్స్ గురించి చెప్పండి. కాసేపు వాళ్లతో డిస్కస్ చేయండి. ప్రాబ్లమ్ ఏదైనా కోప్పడకుండా దాన్ని ఎలా సాల్వ్ చేయగలమో అని ఆలోచించాలి.
- ప్రాబ్లమ్ చిన్నదైతే ఎక్కువ రియాక్ట్ అవ్వకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.
- నలుగురిలో ఉన్నప్పుడు వీలైనంత వరకూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి.
- కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే ముందు ఎదుటి వాళ్లు చెప్పేది వినాలి. ఎందుకంటే వినడం కూడా ఒక కళే, ముందు అది నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ పెంచుకోవాలి.

ఇద్దరు మాట్లాడుకుంటుంటే ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండడం చాలా ఇంపార్టెంట్.

- అసౌకర్యంగా అనిపించే చోటు నుంచి దూరంగా వెళ్లాలి. కాసేపు హాయిగా నేచర్‌ను చూస్తూ వాకింగ్ చేయాలి.
- మీకు నచ్చిన పుస్తకాలు లేదా మోటివేట్ చేసే పుస్తకాలను చదువుకోవాలి. ఈ ప్రాబ్లమ్ మరీ ఎక్కువ ఉంటే ప్రొఫెషనల్ థెరపిస్ట్‌ను కలవడం మంచిది. ఆల్కహాల్ లేదా డ్రగ్స్ వంటి అలవాట్లు ఏవైనా ఉంటే కచ్చితంగా వాటిని మానుకోవాలి.
- కోపం వల్ల రిలేషన్‌షిప్స్ దెబ్బతింటాయి. దానివల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి. కోపం ఎక్కువ రోజులుంటే బీపీ పెరుగుతుంది. హార్ట్ ప్రాబ్లమ్స్, తలనొప్పి, స్కిన్ డిజార్డర్స్, అరుగుదల సమస్యలు వంటివి వస్తాయి. అంతేకాకుండా ఆల్కహాల్ తాగడం, క్రైమ్ చేయడం, ఇతరులను అవమానించడం వంటివి జరుగుతాయి.

## పచ్చిమిర్చిని ఇలా కూడా వాడొచ్చు!



- పచ్చిమిర్చి కట్ చేసిన తర్వాత కొందరికి చేతులు మండుతాయి. అలాంటప్పుడు చేతులకు పంచదార రుద్దుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.
- మాంసాన్ని వేయించేటప్పుడు అది బంగారు గోధుమ రంగులో మంచి లుక్ రావాలంటే మాంసంపై మిరపకాయ ముక్కలను చల్లితే చాలు.
- పచ్చిమిరపకాయల్ని కాసింత పసుపుతో చేర్చి సీసాలో నిలవ చేస్తే ఎరుపు రంగుకు మారకుండా ఉంటాయి.
- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు ఫ్రెష్‌ ఉండాలంటే మొదట శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. మిర్చి తొడిమలు తీసి, గాలి చొరబడని డబ్బా అడుగున టిష్యూ పేపర్ వేసి మిర్చిని దానిపై పెట్టాలి. వాటిపైన టిష్యూ పేపర్ వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. పదిహేను రోజులకొకసారి టిష్యూ పేపర్ మార్చితే రెండు నెలల పాటు పచ్చిమిర్చి

# MOVIE TIME



## హల్లల్లల్లో సాంగొచ్చేసింది..

రోజుకో స్పెషల్ అప్‌డేట్‌తో ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తోంది పెద్ది టీమ్. ఇటీవలే హల్లల్లల్లో ప్రోమో విడుదల చేయగా తాజాగా ఆదివారం ఫుల్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటలో శృతి హాసన్, జాన్వీ కపూర్ లతో కలిసి రామ్‌చరణ్ అదిరిపోయే స్టెప్పులు వేశారు. ఈ పాటలో ముగ్గురూ తమ స్క్రీన్ ప్రజెన్స్‌తో ఆకట్టుకున్నారు. రామ్ చరణ్ స్టైలిష్ లుక్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్‌మెంట్స్‌తో ప్రేక్షకులని మెస్మరైజ్ చేశారు. శృతి హాసన్ తన గ్లామర్, గ్రేస్‌తో ఈ పాటకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో విజువల్ ట్రీట్‌గా ఈ పాట సాగింది. ఫోక్ స్టైల్‌లో సాగిన ఈ మాస్ సాంగ్‌కు అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించారు. రక్షితా సురేష్ పవర్‌ఫుల్ వాయిస్‌కు ఏఆర్ రెహమాన్ బీట్స్ తోడవ్వడం కూడా ప్లస్సయ్యింది. ఈ సాంగ్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా తెరకెక్కించారు. భోపాల్‌లో శనివారం జరిగిన పెద్ది కీ అవాజ్ ఈవెంట్‌లోనే ఈ సాంగ్‌ను రిలీజ్ చేయగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోకి మాత్రం ఆదివారం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం యూట్యూబ్‌తో పాటు మిగిలిన మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో ఉంది.



## 19 ఏండ్ల తర్వాత బంపరాఫర్

యంగ్ హీరోయిన్ల జోరుతో సినిమాల స్పీడును తగ్గించింది అంజలి. ట్రెడిషనల్ హీరోయిన్ రోల్స్ అంటే ఫస్ట్ ఈ ముద్దుగుమ్మ పేరు వినిపించేది. తాజాగా ఈ అమ్మడు తమిళంలో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు సమాచారం. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ వసంత్ బాలన్‌తో ఓ సినిమా చేయబోతుంది. రంగం ఫేమ్ జీవా హీరోగా వసంత బాలన్ దర్శకత్వంలో విషాదాంత ప్రేమకథతో ఓ సినిమా తెరకెక్కబోతుందట. ఇందులో హీరోయిన్‌గా అంజలిని మేకర్స్ కన్ఫామ్ చేసినట్లు సమాచారం. ఇందులో జీవా హీరోగా నటిస్తున్నారు. వీరిద్దరు కలిసి సినిమా చేయబోతుండటం ఇది రెండోసారి. 2007లో వచ్చిన కాట్రాదు తమిళ్ అనే సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. పంతొమ్మిదేళ్ల తర్వాత ఈ జోడీ రిపీట్ కాబోతుండటం తమిళంలో ఆసక్తికరంగా మారింది. త్వరలోనే ఈ మూవీ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందట.



## జననాయగన్ వచ్చేస్తున్నాడు..

జననాయగన్ మూవీ రిలీజ్ కు ముందే ఎన్నో మలుపులు తిరుగుతోంది. హీరోగా విజయ్ నటించిన ఈ చివరి మూవీ సంక్రాంతికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగాసెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడింది. తాజాగా జననాయగన్ రిలీజ్ డేట్‌కు సంబంధించి కోలీవుడ్ సర్కిల్‌లో ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ డిస్ట్రిక్‌తో పాటు మరికొన్నింటిలో జననాయగన్ రిలీజ్ డేట్ జూన్ 19 అంటూ కనిపిస్తోంది. ఈ డేట్ కన్ఫామ్ అని అంటున్నారు.



## ఇక విలన్‌గా..

ఇన్నాళ్లు హీరోయిన్‌గా తన అందచందాలతో అదరగొట్టిన కియారా అద్వాని తొలిసారి నెగెటివ్ రోల్ కనిపించబోతుందట. యశ్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ మూవీలో నయనతారతో పాటు కియారా విలన్‌గా నటిస్తోందట. టాక్సిక్ ప్రమోషన్స్‌లో యశ్ ఈ సీక్రెట్ ను రివీల్ చేశాడు. నయనతారతో పాటు కియారా అద్వానీ పాత్రలు పూర్తిగా నెగెటివ్ షేడ్స్‌తో సాగుతాయట. హీరోయిన్ క్యారెక్టర్లను రొటీన్ ఫార్మాట్‌లో కాకుండా డిఫరెంట్‌గా డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ స్క్రీన్‌పై ప్రజెంట్ చేశారు. హీరోయిన్లను ఇప్పటివరకు ఎవరూ ఈ స్థాయి గ్రే షేడ్స్‌లో చూపించలేదని ఆడియెన్స్ ఫీలయ్యేలా నయన్, కియారా క్యారెక్టర్లు సాగుతాయని యశ్ అన్నారు. అతడి కామెంట్స్ వైరల్ అవుతోన్నాయి. కాగా మార్చి 27న రిలీజ్ కావాల్సిన ఈ మూవీని జూన్ 4కు వాయిదా వేశారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు డిలే కావడంతో జూన్ 4న కూడా ఈ మూవీ విడుదల కావడం లేదని ఇటీవలే ప్రకటించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.